## క్లుప్తంగా

### పీచర గౌడ సంఘం కమిటీ ఎన్నిక



**వేలేరు :** మండలంలోని పీచర గౌడ సంఘం అధ్యక్షుడిగా బత్తిని శ్రీను, ఉపాధ్యక్షుడిగా మంతపురి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా మారబోయిన రాజులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో గౌడ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సట్ల రవీందర్, బాలనర్సు, శ్రీనివాస్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ



జనార్దన్, అధ్యక్షుడు

**కమలాపూర్:** మండల కేంద్రంలోని తీగలబావి వద్ద గల భక్తాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శనిగరపు జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా మౌటం రంజిత్, ఉపాధ్యక్షులుగా మౌటం వీరన్న, కాల్వ కుమార్, కొయ్యడ సునీల్, సహాయ కార్యదర్శులుగా మౌటం తిరుపతి, రాజేందర్, మహేందర్, ప్రచార కార్యదర్శులుగా కిషోర్, వెంకటేష్, రాహుల్, భిక్షపతి, కోశాధికారిగా మండ చరణ్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా చల్లూరి రమేష్, సలహాదారులుగా మౌటం రమేష్, మండ అశోక్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

### పూర్వవిద్యార్థుల చేయూత



**ఆత్మకూరు:** తమతో పాటు ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి సలీం తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పూర్వ విద్యార్థులంతా కలిసి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం సలీంను కలిసి పరామర్శించి రూ.16వేల ఆర్థిక సాయం అందించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**ఐనవోలు :** అక్రమంగా తరలిస్తున్న 2.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు మండలంలోని పంథిని శివారు చింత కుంట క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఉర్సు వరంగల్ ప్రాంతానికి చెందిన గంధం సతీష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

**ఆత్మకూరు:** రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన మహిళ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో ఇటీవల అతివేగంగా టిప్పర్ వాహనం అరటిపండ్లు అమ్ముతున్న బయ్య శాంతమ్మను శుక్రవారం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా శనివారం రాత్రి మృతి చెందింది. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సన్మానం



**వేలేరు :** యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గంగుల రణధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అక్కల ప్రశాంత్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆదివారం మడికొండలో జరిగిన ప్రజాపాలన –ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### మున్నూరుకాపు పరపతి సంఘం కమిటీ

**సంగెం :** మండలంలోని కుంటపల్లిలో మున్నూరుకాపు పరపతి సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కమిటీని సంఘం గౌరవ అధ్యక్షుడు దానం స్వామి ప్రకటించారు. తొలుత గత రెండేళ్ల లావాదేవీలను నివేదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

# యాసంగి నారుమడులు సిద్ధం

- వారం రోజుల్లో ప్రారంభం కానున్న వరినాట్లు
- ఏర్పాట్లలో నిమగ్నమైన మండల రైతులు



యాసంగి సాగుకు సిద్ధమైన నారుమడులు

**ఎల్కతుర్తి :** ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం వల్ల బావులు, చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో భూగర్భ జలాలు అమాంతంగా పెరిగాయి. పుష్కలంగా నీరుండడంతో రైతులు యాసంగి సాగుకు సమాయత్తమవుతున్నారు. వ్యవసాయ బావుల కింద పక్షం రోజుల క్రితమే నారుమడులు సిద్ధం చేసి మొలకఅలికారు. నారుమడులు క్రమక్రమంగా పెరుగుతూ ప్రస్తుతం నాటువేసే స్థాయికి చేరుకుంటున్నాయి. దీంతో మరో వారం రోజుల్లో మండలం వ్యాప్తంగా వరినాట్లు మొదలై ఊపందుకోనున్నాయి. మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకు మరో 3 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో 9 గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టు కింద ఉండగా 10 గ్రామాలు మెట్టప్రాంతంలో ఉన్నాయి. సాగువిస్తీర్ణం 8 వేల హెక్టార్లు ఉండగా 7,350 హె క్టార్లు సాగులో ఉన్నాయి. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు అనుకూలించి కురిసిన వర్షాలతో సాగునీరు పుష్కలంగా ఉంది. విడుదల చేసిన దేవాదుల ప్రాజెక్టు నీటితో మెట్టప్రాంతాల్లో సైతం చెరువులు, కుంటలు నిండి నిండుకుండలా తలపిస్తున్నాయి. సన్నాలకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వడంతో రైతులు ఆనందంతో సాగుకు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

# కాంగ్రెస్ పేదల ప్రభుత్వం



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

**పరకాల:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం ఉదయం జయడీలక్స్ రోడ్డు, సీఎస్ఐ కాలనీలో మార్నింగ్ వాక్ చేపట్టి రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయాల మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే తక్షణమే రోడ్డుపైన ఉన్న చేపల మార్కెట్‌ను లోపలికి తరలించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల కోసం శ్రమిస్తుందన్నారు. దశలవారీగా ప్రజల సమస్యలన్నింటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట మడికొండ సంపత్‌కుమార్, ఒంటేరు సారయ్య, పంచగిరి జయమ్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, నాయకులు వెంకటస్వామి, మడికొండ శ్రీను, మార్క రఘుపతి గౌడ్, జాఫర్ రిజ్వీ, చెంగల్‌రావు, అనంత్, బాబు, నాగరాజు ఉన్నారు.

# హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

**ఎల్కతుర్తి:** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో హిందువులపై దాడిని నిరసిస్తూ హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యాచారాలకు నిరసనగా, మతోన్మాదుల చేతిలో మృతి చెందిన హిందూ బంధువులకు నిరసనగా గ్రామంలోని హైస్కూల్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో హిందూధర్మ పరిరక్షణ సమితి సమన్వయ కార్యకర్తలు దొంగల కొమురయ్య, బత్తిని రాంబాబు, గుండేటి శ్రీధర్, కర్ణకంటి రమణ, సదానందం, అజిత్, త్రిజ్ఞేష్, ధర్మన్న, సాయి, రణధీర్, బాలాజీ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు

# కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

- రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడి ఆవేదన



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

**శాయంపేట :** మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని కొమ్ము భిక్షపతికి చెందిన 10 గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేయడంతో నాలుగు గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుని కథనం ప్రకారం.. పెద్దకోడెపాకకు చెందిన కొమ్ము భిక్షపతి తన ఇట్టి వద్ద చిన్న గొర్రె పిల్లలను వదిలి మిగతా గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. ఇంటి ముందున్న 10 గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేయగా నాలుగు మృతి చెందాయి. మిగతా 6 గొర్రెలు చావు బ్రతుకుల మధ్య ఉన్నాయని తెలిపారు. వాటి విలువ రూ. 50వేలు వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

# ఎరుకల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

- తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు



ప్రదర్శన నిర్వహిస్తున్న తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు

**హన్మకొండ:** ఎరుకల సమస్యలపై అసెంబ్లీ, శాసన మండలిలో చర్చించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీ ఎరుకల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చేవెళ్లలో కాంగ్రెస్ ప్రకటించిన ఎస్టీ డిక్లరేషన్ మేరకు ప్రత్యేక ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ములుగు జిల్లా రామాంజపురం గ్రామంలో కాకతీయ రాజులు 8 వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఎరుకల నాంచారమ్మ పంచకూటాలయాన్ని పునర్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం హనుమకొండ జిలా అధ్యక్షుడు లోనికి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, నాయకులు మానుపాటి సురేందర్, మానుపాటి విజేందర్, మేనరగుత్తి రఘు, దేవర ఎల్లయ్య, మానుపాటి గణేష్, మానుపాటి సాంబమూర్తి, అంబి రాజేష్, దేవర మొగిలి, దేవర శ్రీకాంత్, కాసారం శేఖర్, మానుపాటి ప్రసాద్, పల్లకొండ ప్రణయ్ పాల్గొన్నారు.

### 11న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

**హన్మకొండ కల్చరల్:** ఈనెల 11న గీతాజయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమద్ భగవద్గీతలోని ఆరో అధ్యాయం ఆత్మ సంయమ యోగం శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ డీపీపీ కార్యక్రమ నిర్వహణ బాధ్యుడు రామిరెడ్డి కృష్ణమూర్తి ఆదివారం తెలిపారు. హనుమకొండలోని నక్కలగుట్ట ఎస్ఎంఆర్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరు, ఏడో తరగతుల విద్యార్థులను మొదటి గ్రూపుగా, ఎనిమిది, తొమ్మిదో తరగతుల వారిని రెండో గ్రూపుగా, 18 ఏళ్ల వయస్సు వారిని మరో గ్రూపుగా విభజించి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

### వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



**పరకాల:** సుబ్రహ్మణ్య స్వామి షష్టి జాతర ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించగా బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ ఆధ్వర్యంలో కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేడుకల్లో ధర్మకర్తలు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

### మల్లన్నను దర్శించుకున్న నైమిశారణ్య పీఠాధిపతి



**ఐనవోలు:** ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామిని ఆదివారం నైమిశారణ్య పీఠాధిపతి శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో శివ లీలామృతంపై ప్రవచనం చేశారు. శివుడిని ఆరాధించి ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆయన వెంట ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, పాతర్లపాటి శ్రీనివాస్, మధుకర్ శర్మ, అర్చక సిబ్బంది ఉన్నారు.

### గురుకుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలి





సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

**కేయూ క్యాంపస్:** రాష్ట్రంలోని గురుకులాల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురుకుల బాట కార్యక్రమాన్ని నవంబర్ 30నుంచి డిసెంబర్ 5వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్‌వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల బాట కార్యక్రమంలో అనేక గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీల్లో పలు సమస్యలు నెలకొని ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర మాట్లాడుతూ గురుకుల బాట ద్వారా గుర్తించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ నాయకులు గంధ్రకోట రాకేష్‌యాదవ్, పిల్లల నాగరాజు, గొల్లపెల్లి వీరస్వామి, వస్తం అనిల్, రాయనురి రాజేష్, రత్నం, అశోక్, వినయ్, మదుసాని సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..

- రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తా
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

**శాయంపేట :** మండల ప్రజలకు 108 అంబులెన్స్ ఇస్తానని చెప్పి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని ప్రజాప్రభుత్వంలో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని ఆవరణలో ఆదివారం 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఒగ్గు డోళ్లతో, బోనాల మధ్య కార్యకర్తలతో భారీ ర్యాలీగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాకు చేరుకొని కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా గెలిచి సంవత్సరం గడిచిందని నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. శాయంపేట మండలానికి మొదటి నుంచి అంబులెన్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఎన్నికల ముందు ప్రజలకు 108 అంబులెన్స్ ఇస్తానని చెప్పి అంబులెన్స్ అందజేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రోజుకు 18 గంటలు కష్టపడి పని చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ. 2 లక్షల పైన రుణం ఉన్నవారికి త్వరలో మాఫీ చేస్తామని తెలిపారు. ఇల్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఇందిరమ్మ ఇళ్ల కోసం పైరవీలు చేసే వారిని నమ్మొద్దని సూచించారు. వారం రోజుల్లో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోసి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గాన్ని, శాయంపేట మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, ఆర్డీఓ నారాయణ, 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

**శాయంపేట :** ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. మండలంలోని వసంతాపూర్‌లో ఆదివారం ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మంద భద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలను ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి పథకాలను ఆచరణలో అరకొర అమలు చేసి ఇదే ప్రజాపాలన అంటూ ప్రచార ఆర్భాటం చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీల రవీందర్, గడ్డం నా గా ర్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, మహ్మద్ ఉస్మా న్, వక్కాల కిసాన్, దామరకొండ రమేష్, కూసం బుచ్చయ్య, మొగిలి, శ్రీనివాసారావు, రవీందర్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేసిన లయన్స్‌క్లబ్ సభ్యులు

**ఆత్మకూరు:** మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ దేశాయి ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేవూరి దేవేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పాపని రవీందర్, కోశాధికారి నాగబండి శివప్రసాద్, టింగిలికారి సత్యనారాయణ, పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఏరుకొండ రవీందర్‌గౌడ్, బాదం వెంకటేశ్వర్లు, పోలు రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప, లక్నవరం సందర్శించిన విద్యార్థులు



రామప్పను సందర్శించిన విద్యార్థులు

**ఐనవోలు:** తెలంగాణ విజ్ఞాన్ దర్శనంలో భాగంగా ఆదివారం మండలంలోని పున్నేలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రామప్ప, లక్నవరంలను సందర్శించినట్లు హెచ్ఎం రాయరాకుల పరమేశ్వర్ తెలిపారు. పునాది లేకుండా ఇసుకపై రామప్ప గుడి నిర్మించబడిందని, ఆలయ చరిత్రను చెబుతూ యునెస్కో గుర్తింపు పొందిన ఆలయమని విద్యార్థులకు హెచ్ఎం వివరించారు. అదేవిధంగా లక్నవరం సరస్సు గురించి వివరించారు. విద్యార్థులు ఎంతో ఆనందాన్ని వ్యక్తపరిచినట్లు తెలిపారు. సందర్శనకు వెళ్లిన వారిలో ఏఏపీసీ అధ్యక్షురాలు పొన్నం రమాదేవి, ఉపాధ్యాయులు అన్నారెడ్డి, ఇందిరా, రాహుల్‌కుమార్, వెంకటయ్య, స్వప్న ఉన్నారు.

# ఘనంగా అయ్యప్ప దివ్య పడిపూజ



పంచలోహ విగ్రహానికి అభిషేకం చేస్తున్న మాలధారులు

**కమలాపూర్:** మండల కేంద్రానికి చెందిన ఆడెపు సురేష్ మాలదారుడి నివాసంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి దివ్య పడపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, కుమారస్వామి, లక్ష్మీపూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహానికి అన్ని రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి పడి ముట్టించగానే మాలధారులు, భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. అయ్యప్పస్వామి భజనలు, గీతాలాపనలు, శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడిపూజ మహత్సోవంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### 14 నుంచి రాష్ట్ర మహాసభలు

**విద్యారణ్యపురి:** ఈనెల 14, 15వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కేంద్రంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ బాధ్యులు తెలిపారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర బాధ్యుడు బాదావత్ రాజు మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పెచ్చుమీరి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని, సహజ వనరులను దోచుకునేందుకు అటవీప్రాంతాల్లో నివసించే ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నారని వాపోయారు. మహా సభలకు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోని విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆదునూరి యాదగిరి, ప్రధాన కార్యదర్శి దిలీప్, ఉపాధ్యక్షురాలు పద్మజ, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.